# డబుల్ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

- అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలి
- ఇండ్లల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- అర్హులకు ఇండ్లు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్, డిసెంబర్14(నమస్తే తెలంగాణ):** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలపై అధికారులు పూర్తిస్థాయిలో మానిటరింగ్ చేయాలని, పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు.డబుల్‌బెడ్ రూమ్‌లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఈ విషయంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డబుల్ ఇండ్లు అర్హులైన వారికే నిబంధనల మేరకు అందజేయాలన్నారు.దివ్యాంగుల, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేటాయింపులపై కలెక్టర్ గౌతమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాజీవ్ గృహకల్ప ఇండ్లపై సమీక్షను నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, పంచాయతీ రాజ్ ఈఈ సుమేధా, ఆర్డీవోలు రాజేశ్‌కుమార్, శ్యామ్‌ప్రకాశ్, గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## ఎదులాబాద్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి


ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన ఎదులాబాద్ ప్రజా ప్రతినిధులు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 14:** ఎదులాబాద్ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. ఎదులాబాద్ గ్రామం మండలంలో పెద్దది కావడంతో నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మాజీ మంత్రి మల్లారెడ్డిని కలిసిన వారిలో పంచాయతీ సభ్యులు శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, సహకార బ్యాంక్ డైరెక్టర్ ధర్మారెడ్డి తదితరులు ఉన్నారు.

## పోచారంలో పారిశుధ్య పనులు పరిశీలన


పోచారం మున్సిపాలిటీ 11వ వార్డులోని డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్,చైర్మన్

**ఘట్‌కేసర్,డిసెంబర్14:** పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శానిటేషన్ పనులను కమిషనర్ పి.వేమన రెడ్డి,చైర్మన్ బి.కొండల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం కమిషనర్, చైర్మన్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో వార్డు సూపర్‌వైజర్లు పారిశుధ్య సిబ్బందిని సమన్వయం చేసుకొని శానిటేషన్ పనులను చేపట్టాలని సూచించారు. 11వ వార్డులోని మ్యాన్‌హోల్‌లో మట్టి పేరుకుపోవడంతో సిబ్బంది వెంటనే తొలగించి మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్,ఏఈ నరేశ్,నాయకులు శేఖర్ ముదిరాజ్,స్థానికులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి


కమిషనర్ రాజమల్లయ్యకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు శ్రీనివాస్ రెడ్డి

**మేడ్చల్ కలెక్టరేట్:** దమ్మాయిగూడ 7వ వార్డు ప్రగతినగర్ ప్రధాన రోడ్డు పక్కన అనుమతి లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని గురువారం నాయకులు సామల శ్రీనివాస్ రెడ్డి కమిషనర్ రాజమల్లయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు.

## ఘనంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

**కీసర, డిసెంబర్ 14:** కీసరలోని అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాలను ఆవుపేడ, పాలు, నీళ్లతో అయ్యప్పలు, మాతలతో శుభ్రం చేయించి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు.యాగశాల్లో పలువురు దంపతులు హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ రమేశ్‌గుప్త అయ్యప్పలకు అన్నదానం చేశారు.

## దొంగకు దేహశుద్ధి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 14:** ఓ మహిళ చేతిలోని బంగారం, డబ్బులతో ఉన్న బ్యాగ్‌ను ఓ దొంగ లాక్కొని పరుగులు తీయగా స్థానికులు పట్టుకుని అతనికి దేహశుద్ధి చేశారు.ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఘట్‌కేసర్ పట్టణం ఎదులాబాద్ రోడ్డులోని సౌత్ ఇండియన్ బ్యాంక్‌లో మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఆవుల విజయలక్ష్మి గతంలో 10 తులాల బంగారు నగలను కుదువ పెట్టింది.వాటిన విడిపించుకునేందుకు గురువారం వచ్చింది. బంగారు నగలను విడిపించుకుని బయటకు వస్తుండగా అక్కడే మాటు వేసిన ఓ దొంగ ఆమె చేతిలోని బంగారు నగలతో ఉన్న బ్యాగ్‌ను లాక్కొని పరుగులు తీశాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్‌కు చెందిన హరిందర్‌గా గుర్తించారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మందిరాలను కూల్చడం దుర్మార్గానికి పరాకాష్ట


కూల్చివేసిన చర్చిని పరిశీలిస్తున్న మేయర్ మేకల కావ్య

**జవహర్‌నగర్, డిసెంబర్ 14:** బీఆర్ఎస్ పాలనలో ఆలయాలకు పెద్దపీట వేస్తే, కాంగ్రెస్ పాలనలో ప్రార్థన మందిరాలను కూల్చివేయడం దుర్మార్గానికి పరాకాష్టలాంటిదని మేయర్ మేకల కావ్య అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన చర్చిని రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణం పేరుతో కూల్చివేశారు. ఆ చర్చిని బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి మేయర్ కావ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదోడు బతికే పరిస్థితి లేదని, జవహర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాల పేరుతో అడ్డగోలుగా కూల్చివేతలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. క్రిస్టియన్‌లను బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని, కాంగ్రెస్ వచ్చి రెండు వారాలైనా కాకముందే ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పూనుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. చర్చిని కూల్చడం ఎంతో కలిచివేసిందని అన్నారు. చర్చిని కూల్చివేయడం అంటే క్రైస్తవులందరిపై దాడి జరిగినంత పనిగా క్రిస్టియన్‌లు భావించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు చర్యలు మానుకోవాలని లేకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీతారాజశేఖర్, సీనియర్ నాయకుడు సతీష్ గౌడ్, క్రిస్టియన్‌లు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ఆదర్శం నాగారం

**మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 14:** అభివృద్ధిలో నాగారం మున్సిపాలిటీ ఆదర్శమని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు వినాయక్‌నగర్ కాలనీలో రూ. 10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం చైర్మన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో చాలా అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, కో–ఆప్షన్ సభ్యులు ఆదామ్ షఫిక్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


నాగారం 16వ వార్డు వినాయక్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

## నేడు, రేపు 'మల్లారెడ్డి'లో స్పోర్ట్స్ మీట్

**మేడ్చల్, డిసెంబరు13:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్ర స్థాయి స్పోర్ట్ మీట్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాశాలలో విడుదల చేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ శాలిని, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీకాంత్, హెచ్‌వోడీలు,అధ్యాపకులు ఉన్నారు.

## నేడు నూతన బస్సు సర్వీసులు ప్రారంభం

**శామీర్‌పేట, డిసెంబర్ 14:** మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి ప్రజల సౌకర్యార్థం నూతన బస్సు సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు మేడ్చల్ డిపో మేనేజర్ ఏ.సుధాకర్ తెలిపారు. మేడ్చల్ పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఈనెల 15 నుంచి229–95ఏ రూట్‌లో మేడ్చల్, సుచిత్ర నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వయా కొంపల్లి, సుచిత్ర, బోయిన్‌పల్లి, ప్యారడైజ్, ట్యాంక్‌బండ్, నాంపల్లి, అఫ్జల్ గంజ్, శవరంపల్లి, ఆరాంఘాట్, శంషాబాద్ మీదుగా 05 బస్సులు నడుపబడుతాయన్నారు. మేడ్చల్ నుంచి ఉదయం 5.45, 6.35, 7.25, 8.15, 9.05కు సుచిత్ర నుంచి ప్రతి 50 నిమిషాలకు ఒక బస్సు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ప్రతి 50 నిమిషాలకు ఒక బస్సు సుచిత్రకు నడపడం జరుగుతుందన్నారు.

## ఎల్‌పీజీ వినియోగదారులు ఏజెన్సీల వద్దకు రావద్దు

**కీసర, డిసెంబర్ 14:** ఎల్‌పీజీ వినియోగదారులు eKYC కోసం ఏజెన్సీల వద్దకు రావద్దని తెలంగాణ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కల్లూరి జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ రూ.500పథకం సిలిండర్‌కు eEYCని డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలనే పుకార్లు నమ్మొద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఈ పథకం విధివిధానాలు ఇంకా మాకు చెప్పలేదని అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం, చమురు కంపెనీలు వినియోగదారుల ఇంటి వద్దకే వెళ్లి eKYCని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

## గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి


సుతారిగూడలో వైకుంఠధామ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

**మేడ్చల్ రూరల్, డిసెంబర్ 14:** మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగాపాలన కొనసాగిస్తున్నామని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని సుతారిగూడలో వైకుంఠధామం ప్రహరీ,దహనవాటిక ఏర్పాటుకు గురువారం మున్సిపల్ చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజల అవసరాలకు అనుగుణంగాఅభివృద్ధి పనులు చేపడుతున్నామని, వార్డుల వారీగా సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, అందరి సహకారంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ రజిత వెంకటేశ్, నాయకులుపాల్గొన్నారు.

## రేపు ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**జవహర్‌నగర్, డిసెంబర్ 14:** బాలాజీనగర్ శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తామని ఉద్యమకారుడు, అయ్యప్ప ఆలయం ప్రధాన కార్యదర్శి జిట్టా శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆలయంలో జరిగే ఆంజనేయ స్వామిభూమిపూజ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


బోడుప్పల్ 15వ డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్ కాలనీ ముఖద్వారానికి గురువారం మేయర్ సామల బుచ్చిరెడ్డి, మందసంజీవరెడ్డి, రవికుమార్, కాలనీవాసులతో కలిసి భూమిపూజ చేశారు.
–బోడుప్పల్, డిసెంబర్14